క్లుప్తంగా

యనమలకుదురు ఆలయంలో ప్రత్యేక పూజలు



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆరుద్ర నక్షత్రం సందర్భంగా సహస్ర లింగార్చన, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. శ్రీనివాస భజన బృందం వారిచే భజన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు జీఆర్‌వీ సాగర్ పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ ఈఓ గంగాధరరావు, భక్తులు పాల్గొన్నారు.

నేడు పేరంటాలమ్మ ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులోని శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో మంగళవారం హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి తెలిపారు. భక్తులు అమ్మవార్లకు కానుకల రూపంలో హుండీల్లో సమర్పించిన ఆదాయాన్ని దేవదాయ శాఖాధికారి పర్యవేక్షణలో లెక్కిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, గ్రామ పెద్దలు, సేవా దళ్ సభ్యులు పాల్గొంటారని తెలిపారు.

ఉచిత మజ్జిగ పంపిణీ

రామవరప్పాడు పేరంటాలమ్మ ఆలయ ప్రాంగణంలో దాతలు ఉప్పు నాగరాజు, శివలీలా, రాధాకృష్ణ, ప్రసన్నకుమార్, లక్ష్మి దుర్గల సహకారంతో మంగళవారం బాటసారులు, ప్రయాణికులకు ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ బోయిన భాను ప్రదీప్ మాట్లాడుతూ ఈ వేసవిలో దాతల సహకారంతో ఆలయం వద్ద ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ



పెనమలూరు: పోరంకి గ్రామంలో సోమవారం వాసవీ క్లబ్ నవనిర్మాణ్ కపుల్స్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. రీజినల్ చైర్మన్ గోడ భీమరాజు మజ్జిగ పంపిణీ చేసి మాట్లాడుతూ వేసవి కాలం ప్రారంభమైనందున వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రయాణికుల సేద తీర్చడానికి మజ్జిగ పంపిణీ చేపట్టామన్నారు. విజ్ఞాన్ భారత్ పాఠశాల విద్యార్థులకు ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా క్వాలిటీ కంట్రోల్ ఇన్‌స్పెక్టర్ ఎస్. వైష్ణవి జంక్ ఫుడ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు మానసలక్ష్మి చైతన్య, ప్రోగ్రామ్ ఆఫీసర్ లక్ష్మీదుర్గ, రీజియన్ చైర్మన్ లక్ష్మణ్‌కుమార్, వెంకటమస్తానయ్య, ట్రెజరర్ శైలజ, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మొబైల్ షాపులో చోరీపై కేసు నమోదు

గన్నవరం: మండలంలోని కేసరపల్లిలో ఓ సెల్‌ఫోన్ షాపులో చోరీ ఘటనపై గన్నవరం పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం ప్రకారం.. గ్రామంలో సిరి మొబైల్ షాపును జి.పండుబాబు గత మూడేళ్లుగా నడుపుతున్నారు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి షాపు మూసివేసి ఆదివారం ఉదయం వచ్చి చూడగా షటర్ తాళాలు పగులకొట్టి ఉండడం గమనించారు. షాపులోని 12 కొత్త సెల్‌ఫోన్లు, రిపేరు నిమిత్తం కస్టమర్లు ఇచ్చిన మరో 28 సెల్‌ఫోన్లు, కౌంటర్‌లో ఉన్న రూ. 3.65 లక్షలు చోరీకి గురైనట్లు గుర్తించారు. షాపు యాజమాని పండుబాబు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ట్రాలీ లారీ, ఆటో ఢీ : ముగ్గురికి గాయాలు

ఉంగుటూరు: చెన్నై - కోల్‌కతా జాతీయ రహదారిపై చిన్న అవుటపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు స్వల్ప గాయాలైన సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆత్కూరుకు చెందిన రొక్కం వీరభద్రస్వామి తన ఆటోలో కుటుంబ సభ్యులతో కలసి గన్నవరం వెళ్లి ఇంటికి తిరుగు ప్రయాణమయ్యారు. చిన్న అవుటపల్లిలో ఒక ట్రాలీ లారీ వెనుక నుంచి ఆటోను ఢీ కొనడంతో ఆటో పల్టీ కొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. స్థానికులు సమీపంలోని పిన్నమనేని ఆస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ పైడిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా అన్నాభిషేకం

పామర్రు: స్థానిక విజయవాడ రోడ్డులోని అంకమ్మ తల్లి దేవస్థానంలో రేణుకా పరమేశ్వరుడికి పాల్గుణమాసం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా సోమవారం ఆలయంలో విశేష పూజాదికాలను నిర్వహించారు. తొలుత స్వామికి నమక చమకాలతో అభిషేకాలు చేశారు. కొర్రపాటి భవన్నారాయణ జ్ఞాపకార్థం విజయలక్ష్మి, శ్రీనివాస్, శ్రీదేవి, గాయత్రి, షణ్ముఖ సౌజన్యంతో స్వామికి అన్నాభిషేకాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శరవేగంగా పనులు

- చురుగ్గా విజయవాడ -మచిలీపట్నం జాతీయ రహదారి నిర్మాణ పనులు
- హైవే సర్వీస్ రోడ్లకు మోక్షం
- తుది దశకు చేరుతున్న పెండింగ్ పనులు



ప్రొద్దుటూరు అడ్డరోడ్డు సమీపంలో పూర్తయిన జాతీయ రహదారి నిర్మాణ పనులు

కంకిపాడు: విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులు ఒక్కొక్కటిగా పూర్తవుతున్నాయి. రోడ్డు విస్తరణతో పాటు సర్వీసు రోడ్లకు మోక్షం లభిస్తోంది. ఈ సమస్యలను పరిష్కరిస్తూ ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చింది. ఇప్పటి వరకూ ఉన్న అవాంతరాలు తొలగటంతో జాతీయ రహదారి పెండింగ్ పనులు శరవేగంగా పూర్తవుతున్నాయి. నేషనల్ హైవే అథారిటీ ఏప్రిల్ నాటికి పనులు పూర్తి చేసే లక్ష్యంతో ముందుకు సాగుతోంది.

విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి (ఎన్‌హెచ్-65)ని రూ.1,886.57 కోట్లతో నేషనల్ హైవే అథారిటీ నాలుగులైన్లుగా విస్తరించింది. భూ సేకరణ సమస్యలు, కోర్టు అవాంతరాలతో ఈ రహదారి విస్తరణ పనులు చాలా చోట్ల పెండింగ్ పడ్డాయి. అసంపూర్తి రహదారి నిర్మాణాలతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆయా ప్రాంతాలు ప్రమాదాలకు అవాసాలుగా మారటంతో జాతీయ రహదారిపై ప్రయాణం అంటేనే వాహనచోదకులు, ప్రయాణికులు భయాందోళనలు చెందారు. ఈ సమస్యను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం జిల్లా యంత్రాంగాన్ని ప్రత్యేకంగా ఆదేశించటంతో భూ సేకరణ అవరోధాలను అధిగమించటంతో రహదారి పనులకు మోక్షం లభించినట్లయింది. గతేడాది నవంబర్‌లో జాతీయ రహదారి పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు రూ.30 కోట్ల నిధులను కేటాయించారు. టెండర్లు పూర్తయ్యి నిర్మాణ సంస్థ విస్తరణ పనులపై దృష్టిపెట్టింది.

రహదారి ఇబ్బందులకు చెక్

గండిగుంట వద్ద సర్వీసు రోడ్డు, కంకిపాడు (గోసాల) వద్ద సర్వీసు రోడ్డు అసంపూర్తిగా ఉండటంతో వాహనదారులు అసౌకర్యాలతో రాకపోకలు సాగించే వారు. ఈ నిధులతో గోసాల వద్ద సర్వీసు రోడ్డు ఇప్పటికే పూర్తయ్యింది. గండిగుంట వద్ద రోడ్డు పనులు తుదిదశలో ఉన్నాయి. వీటితో పాటు కంకిపాడు ప్రధాన గ్రామంలో ఉన్న రహదారి గోతులమయంగా ఉండేది. కంకిపాడు అండర్ పాస్‌నుంచి కంకిపాడు చెత్త డొంక వరకూ ఉన్న ప్రధాన రహదారిని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయటంతో ప్రయాణం సాఫీగా సాగుతుందని వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మురుగు సమస్యకు మోక్షం

చిన్న వర్షం కురిసినా ప్రధాన రహదారిపై మురుగు చేరుతున్న పరిస్థితి. దీన్ని అధిగమించేందుకు బెజవాడ బెంజిసర్కిల్ నుంచి పోరంకి వరకూ సుమారు ఆరు కిలో మీటర్ల మేర డ్రెయినేజీ పనులను చేపట్టారు. డ్రెయినేజీ నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంతాల నడుమ నెలకొనే మురుగు అవస్థలకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. పెండింగ్ పనుల్లో భాగంగా పది జంక్షన్ల వద్ద స్ట్రీట్ లైటింగ్, ఎల్‌ఈడీ బ్లింకర్లు మొదలైన పనులను పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

చురుగ్గా నిర్మాణ పనులు

మంజూరైన నిధులతో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తిచేసేలా నేషనల్ హైవే అథారిటీ దృష్టి సారించింది. పెనమలూరు మండలం పోరంకి చేపల కుండీలు (గంగూరు చేపల కుండీలు) వద్ద రోడ్డు విస్తరణను ఇప్పటికే పూర్తి చేసి రాకపోకలకు ఉన్న అవరోధాలను పరిష్కరించారు. కంకిపాడు మండలం కొణతనపాడు - ప్రొద్దుటూరు మధ్య డబుల్‌లైన్‌గా మిగిలిన రహదారిని నాలుగు లైన్లుగా విస్తరించారు. ఈ రోడ్డు మధ్యలో డివైడరు నిర్మాణం జరుగుతోంది. ప్రొద్దుటూరు గ్రామానికి నేషనల్ హైవేకి ఉన్న అప్రోచ్ పని మాత్రమే ఇక్కడ పెండింగ్ ఉంది. డివైడరు ప్రాంతాన్ని రబ్బిష్‌తో నింపుతున్నారు. అప్రోచ్ రోడ్డు నిర్మాణం పూర్తయితే భారీ వాహనాల రాకపోకలు సజావుగా సాగుతాయి. ఉయ్యూరు మండలం గండిగుంట, నిడుమోలు వద్ద రోడ్డు విస్తరణ పనులను చేపట్టారు. ఈ పనులు త్వరితగతిన సాగేలా అధికారులు పర్యవేక్షిస్తున్నారు.



కొణతనపాడు-ప్రొద్దుటూరు మధ్య నిర్మాణంలో ఉన్న డివైడరు

లక్ష్యానికి అనుగుణంగా..



విజయవాడ - మచిలీపట్నం జాతీయ రహదారి విస్తరణలో పెండింగ్ పనులు వేగంగా జరుగుతున్నాయి. భూ సేకరణ, ఇతర సాంకేతిక అంశాలను పరిష్కరించటంలో ప్రభుత్వం ప్రత్యేకంగా శ్రద్ధ వహించింది. ఫలితంగా పనులు వేగంగా పూర్తవుతున్నాయి. ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నాం. మచిలీపట్నం పోర్టు నిర్మాణ సమయంలో రహదారి పెండింగ్‌పనులు పూర్తికావటం ఎంతో అవసరం. నిర్దేశించుకున్న లక్ష్యాలకు అనుగుణంగా పనులు పూర్తయ్యేలా నిరంతరం పర్యవేక్షిస్తున్నాం.

– నారాయణరెడ్డి, పీడీ, నేషనల్ హైవే అథారిటీ

పారిశుద్ధ్యం మెరుగుదలకు ప్రత్యేక చర్యలు

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్యం మెరుగుదలకు ప్రత్యేక చర్యలు చేపట్టామని మున్సిపల్ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన సోమవారం కానూరు, పోరంకి, యనమలకుదురు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. చెత్త సేకరించే వాహనాలు క్రమం తప్పకుండా ప్రతి ఇంటికీ వెళ్లి చెత్త సేకరించాలన్నారు. చెత్త కుండీల వద్ద చెత్త లేకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని కార్మికులను ఆదేశించారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయాలన్నారు. పోరంకిలో రెండు రోజులుగా తాగునీరు లేక జనాలు ఇబ్బందులు పడటంతో కమిషనర్ వెంకటేశ్వరరావు స్వయంగా వచ్చి పరిస్థితులు పరిశీలించారు. ధ్వంసమైన పైప్‌లైన్లు దగ్గర ఉండి మరమ్మతు చేయించారు. భవిష్యత్తులో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు.



పోరంకిలో నీటి సమస్యను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు సమాజ సేవ చేయాలి

పెనమలూరు: ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు సమాజ సేవ చేయాలని జేఎన్‌టీయూకే ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ శ్యామ్ తెలిపారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ఎన్‌ఎస్‌ఎస్ విభాగం తాడిగడపలో సోమవారం నుంచి 7 రోజుల పాటు నిర్వహించనున్న సేవా శిబిరాన్ని ఆయన ప్రారంభించి ప్రసంగించారు. వివిధ విభాగాల్లో చదువుతున్న ఇంజినీరింగ్ విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్ ద్వారా సమాజ సేవ చేయాలని సూచించారు. ఆడ పిల్లలకు చదువుపై ఉపయోగాలు, ప్రాథమిక విద్య పై అవగాహన, ఓటు హక్కు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, స్వచ్ఛభారత్, రోడ్ సేఫ్టీ, పౌష్టికాహారం వలన కలిగే ప్రయోజనాలు తదితర అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డీన్ బావినేని పాండురంగారావు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, పద్మజానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వి.వెంకటేశ్వరరావు, టి.వెంకటేశ్వరరావు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.



తాడిగడప ర్యాలీలో పాల్గొన్న శ్యామ్, విద్యార్థులు

పదో తరగతి పరీక్షలు ప్రారంభం



పెనమలూరు పాఠశాల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు



కంకిపాడు హైస్కూల్ వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు



ఆత్కూరు జెడ్పీ హైస్కూల్‌లో హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

గన్నవరం: గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు ఫస్ట్ లాంగ్వేజ్‌లో పరీక్ష నిర్వహించారు. మండలంలో మొత్తం ఎనిమిది కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు జరిగినట్లు ఎంఈఓ కె.రవికుమార్ తెలిపారు. తొలిరోజు 1,155 మంది విద్యార్థులకుగాను 1,063 మంది హాజరయ్యారని, 91 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్లు తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా పరీక్ష కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, వైద్య సదుపాయలను కల్పించామన్నారు.

పెనమలూరు: మండల పరిధిలో 14 పరీక్షా కేంద్రాల్లో 2,935 మంది పరీక్షలు రాయనున్నారు. సోమవారం ఉదయం పెనమలూరు పోలీస్‌స్టేషన్ నుంచి ప్రశ్నాపత్రాలు ఆయా పరీక్షా కేంద్రాలకు సకాలంలో తరలించారు. పరీక్షా కేంద్రాల వద్దకు విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు కూడా రావటంతో హడావుడి వాతావరణం చోటు చేసుకుంది.

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో జిల్లా పరిషత్ హైస్కూల్, రవీంద్రభారతి హైస్కూల్, చైతన్య హైస్కూల్, కెనడీ హైస్కూల్ నందు ఫస్ట్ ల్యాంగ్వేజ్ పరీక్ష తెలుగు ప్రశాంతంగా జరిగింది. జంబ్లింగ్ సిస్టమ్‌లో జరిగిన ఈ పరీక్షకు వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు ఉదయం 8.30 గంటలకు పరీక్షా కేంద్రాలకు చేరుకోగా, 8.45 గంటలకు విద్యార్థులను కేంద్రాల్లోనికి అనుమతించారు.

కంకిపాడు: మండలంలోని వివిధ గ్రామాల్లో తొమ్మిది పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశారు. మండలంలోని పునాదిపాడు, ఈడుపుగల్లు, సెయింట్ మేరీస్ హైస్కూల్, శ్రీ విద్యాలయ, చైతన్య పాఠశాలలను డైట్ లెక్చరర్ పి.లలిత్‌మోహన్ తనిఖీ చేశారు. తనిఖీల్లో ఎంఈఓ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉంగుటూరు: మండల వ్యాప్తంగా 677మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 648 మంది పరీక్షలకు హాజరయ్యారని ఎంఈఓ-2 సాంబశివరావు తెలిపారు. 29 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు.

గన్నవరంరూరల్: గొల్లనపల్లి జెడ్పీ హైస్కూల్‌లో 132 మంది, వీరపనేనిగూడెంలో 110 మంది, వెదురుపావులూరులో 116 మంది పరీక్షకు హాజరైనట్లు ఎంఈఓ కొండా రవికుమార్ తెలిపారు.

పారా మిలటరీ దళాల కవాతు



ఉంగుటూరులో మిలటరీ దళాల కవాతు

ఉంగుటూరు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా మండల కేంద్రమైన ఉంగుటూరు, ఇందుపల్లి గ్రామాల్లో సోమవారం పోలీసులు పారా మిలటరీ దళాలతో కవాతు నిర్వహించారు. ఉంగుటూరు ప్రధాన కూడలి, ప్రధాన వీధుల్లో పోలీసులు కవాతు చేపట్టారు. శాంతియుత ఎన్నికలకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్బారావు, ఎస్‌ఐ రవిచంద్రకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

110 మందికి కంటి వైద్య పరీక్షలు



గన్నవరంరూరల్: మండలంలోని సూరంపల్లిలో సోమవారం విజయవాడకు చెందిన మ్యాక్సివిజన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక బెస్ట్ మార్ట్ ఆన్‌లైన్ సర్వీసెస్ సంస్థ ప్రాంగణంలో 110 మందికి కంటి పరీక్షలు చేసి మందులు అందజేశారు. 17 మందికి ఆపరేషన్లకు సిఫారసు చేసినట్లు క్యాంపు కో-ఆర్డినేటర్ ఎ.మునేశ్వర్ తెలిపారు. ఆ సంస్థ ఉద్యోగులు, ఆస్పత్రి డాక్టర్లు పాల్గొన్నారు.

గౌరీశంకర స్వామి ఆదాయం రూ.1.34 లక్షలు

గుడివాడటౌన్: స్థానిక గౌరీశంకరపురంలో వేంచేసియున్న శ్రీ గౌరీశంకరస్వామి వారి దేవస్థానం(చిన్న శివాలయం) హుండీ కానుకలను లెక్కించారు. 57 రోజులకు గాను రూ.1,34,183 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ నటరాజన్ షణ్ముగం తెలిపారు. ఆలయ పాలక మండలి చైర్మన్ డాక్టర్ బండారు శ్యామ్‌కుమార్, సభ్యుడు బాలకృష్ణ, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన అవసరం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వినియోగదారులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండటం అవసరమని, అప్పుడే సమస్యల నుంచి దూరంగా ఉంటారని వైవీ రావు అసోసియేట్స్ అధినేత వైవీ రావు అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల కన్స్యూమర్ క్లబ్ ఆధ్వర్యంలో వినియోగదారుల హక్కులపై విద్యార్థులకు అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన వైవీ రావు మాట్లాడుతూ వినియోగదారుల చట్టం ప్రజలకు అనేక అంశాల్లో రక్షణ కల్పిస్తుందని తెలిపారు. దుకాణదారుల నుంచి మోసపోకుండా, నష్టపోకుండా అనేక చట్టాలు అండగా నిలుస్తాయన్నారు. వస్తు, సేవల కొనుగోలు క్రమంలో ఎదురయ్యే నష్టం లేదా ఇతర సమస్యల నుంచి వినియోగదారులకు అండగా ఉంటేందుకు ఈ చట్టాలు దోహదం చేస్తాయని పేర్కొన్నారు. అయితే వాటిపై విద్యార్థులకు ఇతర ప్రజలకు అవగాహన ఉండాలన్నారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులకు వివిధ అంశాల్లో అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమాన్ని క్లబ్ కన్వీనర్ విజయబాబు టెక్కెం నిర్వహించగా కామర్స్ అండ్ మేనేజమెంట్ విభాగాధిపతి ఎస్ హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సామాజిక న్యాయం

మంత్రి జోగి రమేష్



యనమలకుదురులో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న మంత్రి జోగి రమేష్

పెనమలూరు: గడిచిన ఐదేళ్లలో జగనన్న పాలనలో సామాజిక న్యాయం అమలు జరిగిందని, అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేశామని మంత్రి జోగి రమేష్ అన్నారు. యనమలకుదురు ఇందిరానగర్ -2లో సోమవారం మంత్రి జోగి రమేష్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ.. జగనన్న పాలనలో ప్రతీ కటుంబానికి న్యాయం జరిగిందన్నారు. కులమతాలు, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేశామని తెలిపారు. సంక్షేమ క్యాలెండర్‌కు అనుగుణంగానే చెప్పిన సమయానికి పేద ప్రజలకు ఆర్థికంగా ప్రభుత్వం సాయం చేసిందని అన్నారు. భవిష్యత్‌లోనూ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే తిరిగి జగనన్నను సీఎంగా చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

కూటమిని తిప్పికొట్టండి..

ప్రజల సంక్షేమం, అభివృద్ధితో సంబంధం లేకుండా కేవలం అధికారం కోసం ఏర్పడిన కూటమిని ప్రజలు తిప్పికొట్టాలని మంత్రి జోగి రమేష్ పిలుపునిచ్చారు. 2014 సంవత్సరంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రజలను మోసం చేసి అధికారం చేపట్టాయన్నారు. అయితే కూటమి పాలనతో రాష్ట్ర భవిష్యత్తు అంధకారం చేశారని ఆరోపించారు. బూజుపట్టిన లడ్డూలు, గుప్పెడు మట్టి, ప్యాకేజీతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని విమర్శించారు. నేడు జగనన్న ప్రజల అండదండలతో సింగల్‌గా పోరాటం చేస్తున్నారని తెలిపారు. పెనమలూరులో టీడీపీ అభ్యర్థి ఎవరో తెలియక చేతులెత్తేశారని, డబ్బు సంచుల కోసం చంద్రబాబు ఎదురు చూస్తున్నాడని ఆరోపించారు. పెనమలూరు గడ్డపై వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసి జగనన్నకు గిఫ్టుగా ఇద్దామన్నారు. కార్యక్రమంలో కేడీసీసీబీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, పెనమలూరు ఏఎంసీ చైర్‌పర్సన్ నినావత్ చిన్ని, వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు పి.రాఘవరావు, ఈడే చాముండేశ్వరి, గుమ్మడి విజయ్‌కుమార్, నాయకులు వెలగపూడి వరప్రసాద్, శ్రీనివాసరెడ్డి, హక్, మరీదు శ్రీనివాసరావు, అష్రఫ్, కర్రా ఆదిశేషారావు, కత్తెర బాషా, గోపాలకృష్ణ, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి నిరోధకులుగా టీడీపీ నాయకులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం రంగన్నగూడెంలో టీడీపీ నాయకులు అభివృద్ధి నిరోధకులుగా మారారని పీఏసీఎస్ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నేత కసుకుర్తి శ్రీనివాసరావు విమర్శించారు. స్థానిక విలేకరులతో సోమవారం ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో జరిగిన అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక తెలుగుదేశం నాయకులు అసత్య ప్రచారానికి తెరలేపారని దుయ్యబట్టారు. పీఏసీఎస్ భవనం, గ్రామ సచివాలయం, ఆర్బీకే, హెల్త్ సెంటర్, బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మించడంతో పాటు రంగన్నగూడెం-రాజగోపాలపురం రోడ్డును 2.5 కిలోమీటర్ల మేర రూ.3 లక్షల వ్యయంతో అభివృద్ధి చేశామని వివరించారు. టీడీపీ హయంలో గ్రామంలో ఎక్కడా అభివృద్ధి జాడ లేదన్నారు. టీడీపీ, వైఎస్సార్ సీపీ ప్రభుత్వాల హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని గుర్తించిన ప్రజలు రానున్న ఎన్నికల్లో టీడీపీకి బుద్ధి చెబుతారని చెప్పారు. రంగన్నగూడెం గ్రామ కమిటీ అధ్యక్షుడు తలారి ఈశ్వరరావు, సింగన్నగూడెం గ్రామ కమిటీ అధ్యక్షుడు చిన్నాల లక్ష్మీనారాయణ, పార్టీ నాయకులు సుబ్రహ్మణ్యం , సముద్రాల పరిశుద్ధం, జొన్నలగడ్డ జోజి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో భారీగా చేరికలు



పార్టీలో చేరిన కార్యకర్తలతో మంత్రి జోగి రమేష్

పెనమలూరు: కానూరు, పోరంకి ప్రాంతాలకు చెందిన టీడీపీ, జనసేన నాయకులు వైఎస్సార్ సీపీలో చేరారు. గంగూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం పార్టీలో చేరిన వారిని మంత్రి జోగి రమేష్ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ.. జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పాలనను చూసి ప్రతిపక్షపార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారన్నారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని చెప్పారు. అందరూ సమన్వయంతో పని చేసి జగనన్నను తిరిగి సీఎంను చేయాలన్నారు. పెనమలూరు గడ్డపై వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అర్జున్ రెడ్డి, అడ్డేపల్లి చందు, పార్టీలో చేరిన అంజూరి శివయ్య, చింతపల్లి ఏసుబాబు, సాయి సత్యనారాయణ, వీరబాబు, రాము, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



పెనమలూరు: పౌష్టికాహారం తీసుకోవటంతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కె.శ్రీలత తెలిపారు. గంగూరు అంగన్‌వాడీ కేంద్రం -4లో పౌష్టికాహారం పక్షోత్సవాలను సోమవారం ఆమె ప్రారంభించి ప్రసంగించారు. తక్కువ ఖర్చు ఎక్కువ పోషకాలు ఇచ్చే ఆహారం తీసుకోవాలన్నారు. చిరుధాన్యాలు, ఆకుకూరలు, పండ్లు తినాలన్నారు. విటమిన్స్ ప్రోటీన్స్, మినరల్స్ వలన ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. తల్లులు, గర్భిణులు, బాలింతలతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా కార్యదర్శులు టి.లిఖిత, ఎం.జ్యోతి అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో విస్తృతంగా సేవలు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా గవర్నర్ శంకర్‌గుప్తా

ఆటోనగర్(విజయవాడతూర్పు):లయన్స్ క్లబ్ సేవలను గ్రామాల్లో విస్తృతంగా నిర్వహించాలని జిల్లా గవర్నర్ జెఎన్ శంకరగుప్తా అన్నారు. విజయవాడలోని ఓ కల్యాణ మండపంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శంకర గుప్తా మాట్లాడుతూ లయన్స్‌క్లబ్‌లోకి మహిళలనూ భాగస్వాములుగా చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి క్లబ్‌కు సంబంధించి నెలవారీ సమావేశాలు నిర్వహించి తద్వారా గ్రామాల్లో ప్రజలకు సేవలు చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు.

ఈ ఏడాది విద్యార్థులు, మహిళలకు సైకిళ్లు, కుట్టు మిషన్‌లు పెద్ద ఎత్తున పంపిణీ చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో మాజీ లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ శ్రీశాంతి, ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గద్దె శేషగిరి, లయన్స్ క్లబ్ ముఖ్య సలహాదారులు కత్తిక శివనాగేశ్వరరావు, అన్నె శివనాగేశ్వరరావు, విజయవాడ జవహర్ ఆటోనగర్, విజయవాడ ఆటోనగర్, ఆటోనగర్ జెమ్స్ లయన్స్ క్లబ్ సభ్యులు సుంకర దుర్గాప్రసాద్, డాక్టర్ అబ్దుల్ కలాం, కాంతారావు, బెవర నాగేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

నవ వధువుకు అత్తింటి వేధింపులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): నవ వధువుకు అత్తింటి వేధింపుల ఘటనపై కొత్తపేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. లంబాడీపేట తోట లక్ష్మయ్య వీధికి చెందిన భావనకు ఆరు నెలల కిందట ఖమ్మం జిల్లాకు చెందిన డుంగ్రోత్ మోహన్‌కు ఇచ్చి పెద్దలు వివాహం జరిపించారు. వివాహ సమయంలో కట్నం, ఇతర లాంఛనాలు భారీగానే ఇచ్చారు. పెళ్లయి కాపురానికి వెళ్లినప్పటి నుంచి మోహన్ భార్య భావనను వేధింపులకు గురి చేయడంతో బాధితురాలు అత్త, ఆడపడుచులకు చెప్పింది. నీవు తెచ్చిన కట్నం సరిపోలేదని చెప్పి భర్తతో పాటు అత్తింటి వారు వేధింపులకు గురి చేయడంతో బాధితురాలు పుట్టింటికి చేరింది. పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.